## రాజీ మార్గమే రాజ మార్గం

**-లోక్ అదాలత్‌లో 5,800 కేసులు పరిష్కారం**




2లో..


www.prajapakSham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 13 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8


# అవినీతిపై చర్యలులేవెందుకో..?

**-డిమాండ్‌గా మారిన లంచం**

**-ఇబ్బందులు పడుతున్న సామాన్యులు**







**ప్రజాపక్షం/ఖమ్మం :** గతంలో గుట్టు చప్పుడు కాకుండా ఇచ్చింది పుచ్చుకుని అక్రమమో, సక్రమమో కానీ పనులు చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ పని చేయాలన్న ఆ పనికి ఓ రేటు కట్టి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నెల నెల క్రమం తప్పకుండా వేతనాలు ఇస్తున్నా లంచం లేకుండా పని చేసే పని లేదు. పాలనలో అత్యంత కీలకంగా ఉన్న శాఖల్లోనే వసూళ్లు ఎక్కువగా సాగుతున్నాయి. అవినీతికి సంబంధించి నేరుగా ఫిర్యాదులు చేసినా పలు సందర్భాల్లో అవినీతి విషయం నిగ్గు తేలిన చర్యలు తీసుకోవడం లేదు. చర్యలకు కొందరి విషయంలో ప్రజాప్రతినిధులు అడ్డుపడటం మరి కొందరి విషయంలో ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తున్నారు. చర్యలకు ఉన్నతాధికారులు జంకుతుండడంతో ఇప్పుడు అవినీతి కట్టలు తేగింది. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా వసూళ్ల పర్వం యథెచ్ఛగా కొనసాగుతుంది. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖ లో అవినీతి గురించి పలుమార్లు బహిర్గతమైనా చర్యలు తీసుకున్న సందర్భం లేదంటే అతిశయోక్తి కాదు. ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ అసోసియేషన్ పేరిట మద్యం వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లు చేశారు. అయినా దీనిపైన చర్యలు లేవు. బెల్ట్ షాపుల నిర్వహకుల నుంచి వసూళ్లు జరుగుతున్నాయి. కొందరు ఎక్సైజ్ సిబ్బందిపై నేరుగా మిగతా 2లో..

# సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు

## ప్రజలను మరిచి పాలన

**తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో బాగం**




**ప్రజాపక్షం/చింతకాని ః** నైజాం నిరంకుశపాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధులు తాళ్ళపల్లి రాములు స్థూపం వద్ద వారోత్సవాల్ని ఆయన ప్రారంభించారు. తొలత జెండా తాళ్లపల్లి రాములు విగ్రహానికి పూలమాల వేసి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ నాటి మహత్తర పోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసేందుకు యత్నిస్తుందని, రాచరికానికి నిర్బాంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ముస్లీం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే మిగతా 2లో..

## సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా ప్రకటించాలి

**తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/మణుగూరుః** సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు శనివారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ జక్కుల రాజబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, ఆ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. తెలంగాణలో భూస్వామ్య, నిజాం నిరంకుశ పాలనకు మిగతా 2లో..

# అవినీతిపై చర్యలులేవెందుకో..?

(మొదటిపేజీ తరువాయి)
ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో మట్టి దందా, ఇసుక దందా చెలరేగిన నేపథ్యంలో మైనింగ్ శాఖకు వరంగా మారింది. ఎవరు మట్టి దందా చేసినా, ఇసుక దందా చేసినా ఓ ప్రజాప్రతినిధి చేత ఫోన్ చేయించండి అని సలహా ఇస్తున్నారు. ఆ ఫోన్ రాగానే నిశ్చింతగా అక్రమ తోలకాలకు అనుమతులు ఇచ్చి తమకు రావాల్సింది పుచ్చుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఫలానా ప్రజాప్రతినిధి సిఫారసు చేశారని తప్పించుకుంటున్నారు. చివరకు మట్టి దందా చేసిన వాహనాలనే విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ శాఖ సంగతి చెప్పనవసరం లేదు. ఏ రెవెన్యూ శాఖ కార్యాలయంలోనైనా పైసా చెల్లించకుండా పని చేసుకువచ్చే వారు లేరంటే అతిశయోక్తి కాదు. కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా, మీ సేవ కేంద్రాల ద్వారా యథేచ్ఛగా వసూళ్లు సాగుతున్నాయి. గతంలో అవినీతి ఆరపణలు వచ్చినప్పుడు కఠిన చర్యల సంగతి ఎలా ఉన్నా కనీసం బదిలీ అయినా చేసే వారు. ఇప్పుడు అది లేదు. పలు ఆరోపణలు వచ్చినా అదే స్థానంలో కొనసాగుతున్నారు. ఇంజనీరింగ్ శాఖాధికారులు పనుల నాణ్యత విషయం పట్టించుకోవడమే మానేశారు. ఇప్పుడు నాణ్యత విషయంలో గుత్తేదారులను ఇంజనీరింగ్ అధికారులు ప్రశ్నించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితి దశాబ్ద కాలం క్రితం ఏమన్న ఉండేదేమో కానీ ఇప్పుడు గుత్తేదారులే మండల ఇంజనీరింగ్ అధికారి నుంచి ఉన్నతాధికారుల వరకు శాసించే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదారుల్లో ఒకరిద్దరు మినహా అందరూ ప్రజాప్రతినిధులకు ప్రధాన అనుచరులే. ఏదో ఒక రకంగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో మసులుకుంటున్న వారే. అందరికీ కాకపోయినా కొందరికైనా కప్పం కడుతున్న వారే కావడంతో ప్రభుత్వ పరంగా కూడా ఏమి చేయలేని పరిస్థితి. అందుకనే పలు సందర్భాల్లో నాణ్యతలో డొల్లతనం బయటపడుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని శాఖల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించడంతో పాటు ప్రజల పట్ల సానుకూలత ప్రదర్శించకపోతే దాని ప్రభావం ప్రభుత్వంపై పడుతుంది. మండల కార్యాలయాల్లో పనులు కాకపోయినా లంచాలు మోతాదును మించినా ప్రజలు ప్రభుత్వాన్ని ఆయా ప్రాంతాల్లో ప్రాతినిథ్యం వహిస్తున్న వారిని నిందిస్తుంటారు. ఇప్పుడు జిల్లాలో అదే పరిస్థితి ఏర్పడింది. అధికారులు చర్యలకు జంకుతుండడంతో ప్రజాప్రతినిధులే అవినీతి అధికారులకు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో కొంత వాస్తవం కూడా ఉంది. కమిషన్లు పుచ్చుకుని నువ్వు ఏమి చేసినా ఎవరు మాట్లాడరు. ఎవరైనా మాట్లాడితే నాకు ఫోన్ చేయండి అంటూ ప్రజాప్రతినిధులే గుత్తేదారులకు కొందరు అధికారులకు భరోసా ఇస్తుండడంతో అవినీతి మరింతగా పెరిగిపోతుంది. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న పోలీస్ శాఖపై కూడా పలు సందర్భాల్లో ఆరోపణలు వినవస్తున్నాయి. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అక్రమాలకు పాల్పడటం, సైబర్ నేరాల్లో తలదూర్చడం, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించడం జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. శనివారం కూడా ఓ కానిస్టేబుల్ పై ప్రేమ వ్యవహారంలో కేసు నమోదు కావడం చర్చనీయాంశమైంది. ఇటీవల మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పిని మించి అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఓ ప్రజాప్రతినిధి మద్యం వ్యాపారులను పిలిచి మాట్లాడి కొంత పంపించండి అంటూ ఓ ప్రతిపాదన చేశాడట అంతే మద్యం ప్రియులను దోచుకుంటే దోచుకున్నారు కానీ మాకు మాత్రం కొంత మేర అందులో వాటా ఇవ్వండి అని అడిగినట్లు ఉంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా గుసగుసలు కూడా వినిపించాయి. మొత్తంగా చర్యలు శూన్యమైతే ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసహనం, వ్యతిరేకత ఏర్పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అవినీతి అధికారులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** రాజీ మార్గమే రాజ మార్గమని రాజీ పడదగిన కేసుల్లో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం. నాగరాజు తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మూడవ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఛైర్మన్ నాగరాజు మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో ఖమ్మంలో తొమ్మిది, సత్తుపల్లి, మధిరలో మూడు చొప్పున ఏర్పాటు చేసి వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు, ప్రమాదాలకు సంబంధించిన కేసులు, బ్యాంక్, ఆర్థిక సంబంధిత కేసులు, కుటుంబ పంచాయతీలు సహా రాజీపడదగిన కేసులన్నీ రాజీ పడటం మంచిదన్నారు. మన సంస్కృతిలోనే సామరస్య పరిష్కార వ్యవస్థ దాగి ఉందని నాగరాజు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని ఆయన తెలిపారు. అంతే కాకుండా రెండు పక్షాలు సంతృప్తికర ఫలితాలు పొందే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందన్నారు. ఖమ్మంజిల్లా లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించడంలో ఐదవ స్థానంలో నిలిచిందని ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. గత లోక్ అదాలత్‌లో 5,800 కేసులు పరిష్కారం కాగాప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నా యని ఈ సంఖ్యను 10వేలు దాటించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. పరిష్కా రమైన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు వి. శీనయ్య, కృష్ణార్జున్, మహేష్‌నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ సభ్యులు యడ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** వినాయక చవితి ఉత్సవాలను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జూలూరుపాడు ఎస్సై జీనత్ కుమార్ సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జన శోభాయాత్రల నిర్వహణకు నిర్వాహకులు పోలీస్ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలందరూ పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. భక్తి, క్రమశిక్షణతో ఉత్సవాలను జరుపుకోవడం ద్వారా జూలూరుపాడు మండలంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# భారత్ పశుధన్ పోర్టల్‌లో ప్రతీ రైతు డేటా ఆన్‌లైన్‌లో నమోదు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో పశువులు కలిగిన ప్రతీ రైతు డేటాను భారత్ పశుధన్ పోర్టల్ లో నమోదు చేయాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురందర్ సూ చించారు. మండలంలోని చెన్నారం లో గోపాలమిత్ర ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం ను నిర్వహించారు. పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోర్టల్ లో రైతుల వివరాలు నమోదు చే సుకునేందు సిబ్బంది రైతుల ఇంటి ముంగిట కు వస్తున్నారని అన్నారు. కావునా రైతులు ఆధార్ కార్డులు అందించి డేటా వివరాలు తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఇప్పటి వరకు 15 వేల మంది వరకు నమోదు చేయలేదన్నారు. నేషనల్ డిజిటల లైవ్ స్టాక్ మిషన్ లో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో లంపిస్కిన్ వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లుతెలిపారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్.కె.కిషోర్, నేలకొండపల్లి, రాజేశ్వర పురం పశువైద్యశాల వైద్యాధికారులు శ్రీనివాసరావు, భవనేష్, సూపర్వైజర్ వెంకటేశ్వర్‌రావు, గోపాలమిత్ర లు నాగరాజు, తాజ్బాషా, నరేష్, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** స్థానిక వాణి వివేకానంద విద్యాలయంలో వినాయక చవితి సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చుండూరు కోటేశ్వర రావు, ప్రిన్సిపాల్ వాణి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని దేవుడు యొక్క ఆశీర్వచనాలు విద్యార్థులపై కలిగి ఉండాలని, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండురులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు

(మొదటిపేజీ తరువాయి)



ప్రయత్నం చేస్తుందన్నారు.సాయుధ పోరాటంలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని బీజేపీ, ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టులు చేసిన వీరోచిత పోరాటలను తట్టుకోలేకే నైజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సెప్టెంబర్ 17అని సాయుధపోరాటానికి పిలునిచ్చిన రోజని పేర్కొన్నారు. నాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో జమిందార్లు ,నిజాం నిరంకుశపాలనకు ఎదురొడ్డి సుమారు పదిలక్షల ఎకరాలు భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు.నిజాం నిరంకుశపాలనలో మాతృభాషలో విద్యాబోధన నిషేధం, వెట్టిచాకిరి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, దారిద్రం ప్రజలను పట్టి పీడించాయని, అలాంటి పరిస్థితులే ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయన్నారు.సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, నేటి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంగా భోధించాలన్నారు. సాయుధ పోరాట అమరులు ఆశించిన లక్ష్యాల సాధన దిశగా ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, ఏనుగు గాంధీ, రావి శివరామ కృష్ణ, పాపులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, చిన్నమండవ సర్పంచ్ పర్సా రామచంద్రరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, వ్యకాస మండల కార్యదర్శి గోగుల ఆది, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, నాయకులు పెంట్యాల చలమయ్య, తుపాకుల సైదులు, అంజయ్య, తాళ్లపల్లి అజయ్, చేట్రోలు ఇంద్రసేన, షేక్ దస్తగిరి, చాట్ల రమేష్, బారాస నాయకులు పాపినేని రంగారావు, సీపీఎం నాయకులు పులి యజ్ఞనారాయణ , కొల్లి చిన్న వెంకటి, పుల్లా సాహెబ్, రాదమ్మ , తూములూరి సురేష్, తాళ్లపల్లి రాములు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)
వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటం ఫలితంగా లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సీపీఐకి ఉందన్నారు. వేలాది మంది రైతులు, కార్మికులు, ప్రజలు పోరాటంలో పాల్గొని త్యాగాలు చేశారని పేర్కొన్నారు. చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని సాబీర్ పాషా విమర్శించారు. నిజమైన చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా యువతకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 1947 ఆగస్టు 15 దేశానికి స్వాతంత్రం వచ్చిన తెలంగాణ నిజాం నవాబు నిరంకుశ పాలనకు దేశ ముక్కులు, భూస్వాములు ఈ ప్రాంత ప్రజలను పీడిస్తూ వెట్టి చాకిరి బానిసత్వం కొనసాగిస్తూ మహిళలను అత్యాచారాలు చేస్తూ దమన కాండా నిర్వహించారు. దీనికి వ్యతిరేకంగా ఆనాడు దొడ్డి కొమరయ్య, మోహిం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, నాయకత్వాన ఆనాడు చాకలి ఐలమ్మ , మల్లు స్వరాజ్యం, చంద్ర రాజేశ్వరరావు ఇలా అనేకమంది నాయకత్వంలో వేలాదిమంది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాహితులై నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేసి సుమారు 5000 మంది ప్రాణత్యాగం చేశారని సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగిన పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు చనిపోయారని , 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన జరిగిందని , కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సుమారు 24 లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందని, దేశంలోనే పెద్ద పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమేనని దీనిని పాఠ్యాంశాలలో చేర్చాలని భవిష్యత్ తరాలకు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, సమానత్వం కోసం జరిగిందన్నారు. కానీ కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం మత రాజకీయం సృష్టిస్తున్నారని ఇది సరైన విధానం కాదని వారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని గుర్తించి సెప్టెంబర్ 17న విమోచన దినంగా ప్రకటించి తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ముందుగా సిపిఐ జెండాను రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సర్ రెడ్డి పుల్లారెడ్డి ,మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి మాట్లాడారు. మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు వై రాంగోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, సాంబయ్య గూడెం సర్పంచ్ వీరం ఉషారాణి రామంజవరం సర్పంచ్ బాడిశ కల్పన, బాడిస సతీష్, ఎస్ కే సర్వర్, పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్, జిల్లా సమితి సభ్యులు గద్దం మనోహరి, కరకగూడెం మండల కార్యదర్శి వంగర సతీష్, నాయకులు ఎస్ వి నాయుడు, కొత్తపల్లి సీతారాములు, దండగల బాబు భీమరాజు కృష్ణ, సింగిరెడ్డి సతీష్, ఎస్కె ఉమర్, ఆధర్ల రాములు నోముల రవి, కన్యబోయిన ప్రసాద్, బోసెట్టి సంపత్, యాకూబ్, శివయ్య, వెంకన్న ఆధార్ల రేణుక, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవలో పువ్వాడ కుటుంబం

**-15 ఏళ్లుగా ఉచిత సేవా కార్యక్రమాలు**
**-నేడు దివ్యాంగులకు కృత్రిమ పాదాలు వితరణ**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లాలో మానవతా సేవ, దాతృత్వం, సామాజిక బాధ్యతకు పెద్దపీట వేస్తూ ఖమ్మం జిల్లాలో పువ్వాడ నాగేశ్వరరావు కుటుంబం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పువ్వాడ ఫౌండేషన్ స్థాపించి పేదలు, నిరుపేదలు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు, మందుల పంపిణీ, గర్భిణీలకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులతో వైద్య సేవలు పొందలేని వారికి సైతం అండగా నిలుస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ పువ్వాడ కుటుంబం ప్రజలకు అండగా నిలిచింది. మమత ఆసుపత్రి ద్వారా వైద్య సేవలను విస్తృతం చేశారు. వైద్య రంగ సేవలతో పాటు సామాజిక బాధ్యతగా ఆపదలో ఉన్న వారికి చేయూతనందిస్తున్నారు. పువ్వాడ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మమత వైద్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు, సిపిఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదిన సందర్భంగా పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 88 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని రోటరీ క్లబ్‌లో పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన నున్నారు.

# నాలుగు మెగా వాట్ల సౌర విద్యుత్ అనుసంధానం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం కుసుమ్ పథకం క్రింద జిల్లాలో నాలుగు మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ప్లాంట్లను విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. శనివారం ఎస్ఈ శ్రీనివాసాచారి మాట్లాడుతూ కల్లూరు మండలం 33/11 కెవి మిట్టపల్లి సబ్ స్టేషన్ పరిధిలో రెండు మెగావాట్లు, వైరా మండలం జానకిపురం సబ్ స్టేషన్ పరిధిలో రెండు మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి వల్ల పర్యావరణహిత హరిత ఇంధనానికి ప్రోత్సాహం లభించడమే కాకుండా విద్యుత్ సంస్థకు అదనపు విద్యుత్ లభ్యత పెరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా భాగస్వాములైన రైతులకు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం సమకూరుతుందన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా 55 ప్లాంట్ల ద్వారా 93.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడమే లక్ష్యమన్నారు. త్వరలో మిగిలిన ప్లాంట్లను కూడా అందుబాటులోకి తేస్తామని తెలిపారు. ప్రైవేటు ప్లాంట్లతో పాటు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను సేకరించి సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే తిరుమలాయపాలెం, పెద్దగోపతి, తల్లాడ సబ్ స్టేషన్ పరిధిలో సంస్థ స్వయంగా ఒక్కో మెగావాట్ సామర్థ్యంతో ప్లాంట్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



ప్రజాపక్షం/చింతకాని : గణేష్ ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని వైరా సీఐ వెంకటప్రసాద్ సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు గణేష్ ఉత్సవకమిటీలు, మండప నిర్వాహకులు, డీజే సౌండ్ సిస్టం యజమానులతో చింతకాని పోలీస్ స్టేషన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించడం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, విద్యుత్ భద్రతా చర్యలు తీసుకోవడం, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని , డీజేలు వాడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లౌడ్ స్పీకర్ల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేయరాదని స్పష్టం చేశారు. శోభయాత్ర, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు , మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్సై జి నరేష్, ఏఎస్సైలు లక్ష్మణ్‌చౌదరి, సువర్ణబాబు, సిబ్బంది , గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికి ఆదర్శం : దండు



ప్రజాపక్షం/సత్తుపల్లి: భూమికోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని అట్టి పోరాట స్ఫూర్తితో రానున్న కాలంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దించేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని చెరుకుపల్లిలో పోడు సాగుదారుల సమావేశం తాటి వీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు తేదీ వరకు సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధులు కొరసా జోగయ్య కొరస పెంటమ్మ స్తూపం వద్ద సాయిధ సాయిధ పోరాట వారోత్సవ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని దీనికి సిపిఐ జాతీయ కౌన్సిల సభ్యులు కామ్రేడ్ భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దండి సురేష్ , జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సింగం నరసింహారావు ఇంకా జిల్లా నాయకులు హాజరవుతారని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం, గడ్డం కృష్ణయ్య, తాటి రాజులు, గడ్డం రాజులు, దార బోయిన రాజా, గడ్డం తిరుపతమ్మ, తాటి రాజమ్మ, తాటి చిన్న వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌విఎం పాఠశాలలో ఘనంగా గణేష్ చతుర్థి వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం : స్థానిక శ్రీనివాసనగర్‌లోని ఎస్వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో గణేష్ చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఉత్సాహభరిత వాతావరణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. విద్యార్థులు గణేశుని విశిష్టత, పండుగ ప్రాముఖ్యతను తెలియచేస్తూ ప్రసంగాలు, భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొండ శ్రీధర్‌రావు మాట్లాడుతూ వినాయక చవితి మనలో భక్తి, ఐక్యత, క్రమశిక్షణ, పర్యావరణ వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. వాతావరణ కాలుష్య నివారణ కోసం మట్టి విగ్రహాలనే పూజించాలని సూచించారు. విద్యార్థుల ఆనందోత్సాహాలతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్, మురళీమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ ఆదర్శలో పర్యావరణహిత గణపయ్యలు



ప్రజాపక్షం/చింతకాని : పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు వినూత్నంగా మట్టి, పిండి, సహజ పదార్థాలతో పర్యావరణ హిత వినాయక విగ్రహాలను రూపొందించి శనివారం ప్రదర్శించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బోడెపూడి కిరణ్ మాట్లాడుతూ పర్యావరణ హిత విగ్రహాల వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన గణపతి విగ్రహాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం : స్థానిక శ్రీనగర్‌కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో వినాయక చవితి పండుగ సందర్భంగా సకలాభీష్ట ప్రదాత అయిన వినాయకుని పుట్టిన రోజు వేడుక వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కొండ శ్రీధర్‌రావు పాల్గొని మాట్లాడుతూ వినాయక చవితి పండుగ విశిష్టతను తెలియచేసి ప్రకృతి శక్తులను పూజించే గొప్ప సంస్కృతి మన భారతీయ పండుగలలో ఉందని కొనియాడారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన రంగుల విగ్రహాలను పూజించడం ద్వారా అందులోని హానికర రసాయనాలు భూమిని, నీటిని, గాలిని కలుషితం చేసి ఎన్నో మూగ జీవులకు, మానవాళికి ప్రాణహాని చేస్తాయని తెలిపారు. ప్రకృతి సహజసిద్ధమైన మట్టి గణపతులను పూజించి, మనలను, భావితరాలను అనేక జీవరాశులను కాపాడుకోవాలని ఆయన సూచించారు. అందరికి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కృష్ణవేణి, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాప, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలలో వైభవంగా వినాయక చవితి వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో భక్తి సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పర్యావరణహిత వినాయ విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థులు పూలు, పండ్లు, సహజసిద్ధమైన వస్తువులతో ఎకో ఫ్రండ్లీ వినాయక విగ్రహాలను తీసుకువచ్చి ప్రదర్శించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా వినాయక పూజ నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహభరిత నృత్యాలు వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈసందర్భంగా డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ వినాయక చవితి వంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేయడంతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను చేర్పించే గొప్ప అవకాశం కలిగిందని, ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించడం అభినందనీయమని అన్నారు. మట్టి వినాయకుడు మన ప్రకృతికి మేలు అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జి విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ముదిగొండ: అనారోగ్యం, వైద్య చికిత్సలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..అనుకోని అనారోగ్య సమస్యలు, ఖరీదైన వైద్య చికిత్సల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల కష్టాల్లో వారికి అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమని నాయకులు పేర్కొన్నారు. సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఉసికల రమేశ్, ముదిగొండ గ్రామశాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సామినేని నాగేశ్వరరావు, ఇరుకు కొరివి, రాఘవాపురం గ్రామ అధ్యక్షుడు వీర్ల ముధాకర్, ఉపేంద్రయ్య, కొమ్ము నర్సింహారావు, రోశయ్య, రాధాకృష్ణ, బలంతు వెంకట్, దేశబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి ఆత్మహత్య

**- డబ్బుల కోసం కొందరు వేధించారని సూసైడ్ నోట్**

ప్రజాపక్షం/ముదిగొండ: ఓ యువకుడు లేఖ రాసి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ముదిగొండలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ముదిగొండకు చెందిన వినయ్‌కుమార్ అనే యువకుడు ఆత్మహత్యకు ముందు ఓ లేఖ రాసినట్లు సమాచారం. తనను కొందరు డబ్బులివ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని లేఖలో వినయ్‌కుమార్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. యువకుడు రాసినట్లు చెబుతున్న లేఖను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలు, లేఖలో పేర్కొన్న అంశాలపై దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఆధారాలతో హాజరు కావాలి

**-తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధార్‌తో పాటు నోటీసులో సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో వర్తించే ఆధారాలను సమర్పించాలని తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ సూచించారు. శనివారం ఎస్ఐఆర్(ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ)లో భాగంగా సారపాక గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ గుగులోత్ శివరాం నాయక్ అధ్యక్షతన హియరింగ్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 195 నుంచి 218 వరకు పోలింగ్ స్టేషన్లకు చెందిన బీఎల్ఓలు సారపాక గ్రామ పంచాయితీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఓటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఈఓ జి రవికుమార్, జీపీఓ ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, ఇంటక్ జిల్లా కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు తిరుపతి, ఏసోబు, కాంగ్రెస్ నాయకులు తిరుపతి చంటి, భూక్య లక్ష్మణ్, బీఎల్ఓలు, సిబ్బంది, పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతా నియమాలు తప్పనిసరి : ఎస్ఐ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రానున్న గణేష్ నవరాత్రుల సందర్భంఆ మండపాల నిర్వాహకులు, సర్పంచులతో పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మేడ ప్రసాద్ భద్రతా నిబంధనలను వివరించారు. మండపాల నిర్వాహకులు ముందు గా ఆన్‌లైన్‌లో మండప వివరాలు నమోదు చేసి పోలీసుల అనుమతి పొందాలని, విద్యుత్ శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, మండలపాల వద్ద, ఊరేగింపుల్లో డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి వసతి లేదా అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రాత్రి 10గంటల తర్వాత శబ్ద పరికరాలు వినియోగించరాదని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే లేదా రెచ్చగొట్టే పాటలు, నినాదాలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## వరి బోనస్ కోసం రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** వరి బోనస్ కోసం పంట వివరాల ఆన్‌లైన్ నమోదు గడువును సెప్టెంబర్ 17 వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన వరి రకాలను సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఆధార్, పట్టాదారు పాసుబుక్, విత్తనాల బిల్లుతో డీలర్ వద్ద, సొంత విత్తనం వినియోగించిన వారు రైతు ధ్రువీకరణ పత్రంతో ఏఈఓ వద్ద వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పోర్టల్‌లో నమోదైన రైతులకే క్వింటాల్‌కు రూ 500 బోనస్ లభిస్తుందని, గడువులోగా నమోదు చేసుకుని ప్రభుత్వ పథకం ప్రయోజనం పొందాలని కోరారు.

## ములకలపల్లిలో భారీ వర్షం

**-ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, రైతుల్లో కొత్త ఆశలు**

**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహించాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటిటి నుంచి చిరుజల్లులకే పరిమితమైన పరిస్థితుల్లో తొలిసారిగా భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షంతో భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు బావులు, బోరుబావుల్లో నీటి మట్టాలు పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంజేపీ కూసుమంచి విద్యార్థి



**ప్రజాపక్షం/కూసుమంచి:** సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ట్రైథ్లెన్ పోటీల్లో ఎంజేపీ కూసుమంచి బీసీ గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థి కె యశ్వంత్ ప్రతిభ కనబరిచాడు. అండర్ 14 విభాగంలో లాంగ్‌జంప్, హైజంప్‌లో ప్రథమ స్థానం, 60 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈనెల 26,27 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో యశ్వంత్ పాల్గొననున్నాడు. విద్యార్థిని ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి సీహెచ్ రాంబాబు, ప్రిన్సిపాల్ పి మల్లయ్య, ఏటీపీ ప్రేమలత, డిప్యూటీ వార్డెన్ నరసింహారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బి నరసింహారావు, టి భాస్కర్, తదితరులు అభినందించారు. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# చింతకాని.. విప్లవ బందూక్..!

**- ఎర్రజెండా నీడలో రగలిపొంగిన బావుటా**
**- బాంచన్ అన్న చేతులే బాకులుగా మారిన వేళ**
**- నిజాం నిరంకుశత్వాన్ని నిలువునా దహించిన సాయుధ సమరం**
**- చింతకాని పోరుగడ్డపై ఎగిసిన రక్తాక్షరాల రణభేరి**
**- తెలంగాణ సాయుధ పోరాటంపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం**





**ప్రజాపక్షం/ ఖమ్మం టౌన్ :** నాడు నైజాం నవాబుల దాష్టీకం నడి వీధిలో నాట్యమాడుతోంది. దొరల పెత్తనం, రజాకార్ల దౌర్జన్యాలు పేదల ప్రాణాలను పీల్చి పిప్పి చేస్తున్నాయి. బాంచన్ నీ కాల్మొక్తా అంటూ మోకరిల్లిన అమాయక జనం, ఆ వెట్టి చాకిరి బంధనాలను తెంచుకోవడానికి ఒక్కసారిగా అగ్ని పర్వతమై బద్దలయ్యారు. అణిచివేత ఎక్కడైతే తీవ్రమైందో అక్కడే విప్లవ బందూకులు ఎక్కుపెట్టారు. ప్రపంచ రణ చరిత్రలోనే మునుపెన్నడూ చూడని మహోత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మంటలై ఎగిసిపడింది. ఈ రక్తాక్షరాల సమయంలో ఖమ్మం జిల్లా చింతకాని గడ్డ ఒక విప్లవ కేంద్రమైన రజాకార్ల పాలిట సింహ స్వప్నంగా మారింది. తెలంగాణ నేల కేవలం మట్టి కాదు, రజాకార్ల దౌర్జన్యాలపై, నిజాం నిరంకుశత్వంపై బందూకులు ఎక్కుపెట్టిన విప్లవాల నిలయమని చింతకాని ఉవ్వెత్తున ఎగసిపడింది. వీరత్వానికి, త్యాగానికి ప్రతిరూపంగా నిలిచి తన రక్తాని దారపోసి చరిత్ర పుటల్లో చెరగని ముద్ర వేసింది. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ మట్టి ముద్దుబిడ్డలు సాయుధులై సాగించిన పోరాటం ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనది. వెట్టిచాకిరి, వివక్ష నుంచి విముక్తి కోసం సామాన్యులు సైతం సైనికులుగా మారి బందూకుల పట్టారు. తెలంగాణను భారత యూనియన్‌లో విలీనం చేసే దిశగా అడుగులు వేయించిన ఈ మహోత్తర పోరాటంలో చింతకాని మండలానికి ప్రత్యేక విశిష్ట ఉంది. 1946 నుండి 1951 వరకు సాగిన ఈ రణ క్షేత్రంలో చింతకాని పరిసర గ్రామాలు అగ్ని గుండంగా మారి ప్రతి ఇల్లు ఒక రక్షణ దుర్గంగా ప్రతి మనిషి ఒక పోరాట పటాలంగా నిలిచారు.

**పోలీస్ కాల్పులు, రజాకార్ల అరాచకాలు :**



ఈ పోరాటంలో చింతకాని మండలం భారీ మూల్యాన్నే చెల్లించింది. దళాలకు సహకరించిన 25మంది సభ్యులు పోలీస్ కాల్పుల్లో మరణించగా, మరొక 15మంది కాన్సంట్రేషన్ క్యాంపుల్లో ప్రాణాలు వదిలారు. ప్రొద్దుటూరు, నేరెడ, రేపల్లెవాడ, నాగులవంచ, నాగిలికొండ, కొదుమూరు, వందనం, సీతంపేట వంటి గ్రామాల ప్రజలు నడుం బిగించి పోరాడారు. 1950 నవంబర్‌లో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు విరుచుకుపడి గ్రామాల్లో దాదాపు 70మంది మహిళలను వీధుల్లో నిలబెట్టి చితకబాదారు. పురుషులను చిత్ర హింసలకు గురిచేసి 12మందిని కాల్చి చంపారు. రేపల్లెవాడ వద్ద కాల్చి చంపిన ఏడుగురి మృతదేహాలను గోవిందాపురం వద్ద ఒకే చితిపై దహనం చేయడం నాటి అరాచకానికి పరాకాష్ట. ఈ దాడిలో తమ్మినేని బుచ్చయ్య, కాగోపయ్య, మడుపల్లి వీరస్వామి, ప్రొద్దుటూరుకు చెందిన తుడుం నల్ల ముత్తయ్య అమరులయ్యారు.

**కమాండర్ల నాయకత్వం - గడులపై దాడులు :**

చింతకాని, బోనకల్ ప్రాంతాల్లో సాయుధ దళానికి కమాండర్‌గా రావెళ్ల జానకిరామయ్య, హెడ్ కమాండర్‌గా చుండూరు నర్సింహారావు నాయకత్వం వహించారు. వీరి ధైర్య సాహసాల ముందు రజాకార్లు చిత్తయ్యారు. వీరితో పాటు తాళ్లపల్లి రాములు, తుళ్లూరి సీతారామయ్య, తులసమ్మ, తుళ్లూరు నర్సింహాయ్య, చాలా సాంబయ్య వంటి నాయకులు ప్రొద్దుటూరులో 250మందికి పైగా ప్రజలను ఏకం చేసి రజాకార్లపైకి దండయాత్ర చేశారు. భూస్వాముల గడులపై దాడులు చేసి నిరంకుశ మూకలను ఊళ్ల నుంచి తరమికొట్టారు.

**అమరుల త్యాగాలకు ప్రణామం :**

చావనైనా చస్తాం కానీ ఉద్యమాన్ని వీడేది లేదు అని ప్రతిబూనిన పోరాట యోధులు గ్రామల శివార్లలో కంచెలు ఏర్పాటు చేసుకుని రక్షణ వలయాలు నిర్మించారు. ఊరూరా ఎర్రజెండాలు ఎగరేసి నిజాంకు పన్నులు చెల్లించేది లేదని తెగేసి చెప్పారు. దళ సభ్యులు ప్రజలకు రజాకార్లను ఎదుర్కొనే వ్యూహాలపై శిక్షణ ఇస్తూ నిరంతరం ఉత్తేజపరిచారు. ఈ వీరత్వానికి ప్రతీకగా ప్రొద్దుటూరు గ్రామంలో అమరుల జ్ఞాపకార్థం ఒక ప్రత్యేక స్మారక చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రాణాలు త్యాగం చేసి స్వేచ్ఛను ప్రసాదించిన ఆ అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం వారికిచ్చే నిజమైన నివాళి.

# నైజం నవాబుకు ఎదురొడ్డి నిలిచి..

**- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవానికి గౌరవ చిహ్నంగా ఎం,వెంకటయపాలెం**
**- తండ్రిపైనే తిరుగుబాటు చేసిన కొడుకు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నైజాం నిరంకుశ పాలన..సామాన్య ప్రజలపై అణచివేతలు..వెట్టిచాకారీ, దొపిడీ..ఇలా తాడిత,పీడిత ప్రజల జీవితం దుర్భరంగా మారిన రోజుల్లో తమ హక్కుల కోసం ఎదురు నిలిచిన పోరాట యోధులెందరో..అలాంటి వీరుల పోరాటానికి, త్యాగాలకు ఖమ్మం రూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెం గ్రామం కూడా సాక్ష్యంగా నిలిచింది. నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ గ్రామానికి చెందిన గంగవరపు శ్రీనివాసరావు ప్రజల పక్షాన నిలిచి పోరాడారు. 1946లో తెలంగాణలో అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమాలు ఊపందుకున్న సమయయంలో శ్రీనివాసరావు కూడా ఆ పోరాటం వైపు ఆకర్షితులయ్యారు. ప్రజలపై జరుగుతున్న అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండలేక ఉద్యమంలోకి అడుగుపెట్టారు. అయితే ఆయన పోరాటం మరింత ప్రత్యేకమైనది. నైజాం పాలనకు వ్యతిరేకంగా నిలిచిన శ్రీనివాసరావుకు స్వయంగా తన కుటుంబంలోనే ఒక విరుద్ధ పరిస్థితి ఎదురైంది. ఆయన తండ్రి అప్పట్లో పోలీస్ పటేల్‌గా ప్రభుత్వ వ్యవస్థలో బాధ్యతలు నిర్వహిస్తుండగా, కుమారుడు మాత్రం అదే పాలనకు వ్యతిరేకంగా పీడిత ప్రజల పక్షాన నిలిచాడు. తండ్రి పోలీస్ పటేలుగా ప్రభుత్వ విధుల్లో ఉంటే..కొడుకు ప్రజల హక్కుల కోసం పోరాట బాట పట్టడం అప్పటి పరిస్థితుల్లో ఎంతటి సాహసమో ఊహించుకోవచ్చు. అయిన శ్రీనివాసరావు వెనుకడుగు వేయలేదు. తాడిత, పీడిత ప్రజలకు బానిసత్వం నుంచి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో పోరాటంలో ముందుకు సాగారు. చివరకు తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగుతున్న సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ బలగాల కాల్పుల్లో శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయారు. ఒక పోరాట యోధుడి జీవితం అక్కడితో ముగిసిపోయినా..ఆయన త్యాగం మత్రం ఆ కుటుంబంలోనే మరో



రూపంలో కొనసాగింది. శ్రీనివాసరావు మరణించే సమయానికి ఆయన భార్య గర్భవతి. భర్తను కోల్పోయిన విషాదంలోనే ఆమె తర్వాత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తండ్రిని చూడకుండానే ఈ లోకంలోకి వచ్చిన ఆ బిడ్డకు గంగవరపు విజయ్ అని పేరు పెట్టారు. తండ్రి ముఖం తెలియకపోయినా. ఆయన పోరాట గాథ మాత్రం విజయ్‌కు వారసత్వంగా అందింది. పెరిగి పెద్దయ్యాక విజయ్ కూడా అదే ప్రజా ఉద్యమాల బాటను ఎంచుకున్నారు. సిపిఐలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ప్రజా ఉద్యమాలకు కేంద్ర బిందువుగా మారారు. అలా తండ్రి ప్రాణత్యాగంతో ఆగిపోవాల్సిన పోరాట స్ఫూర్తిని కుమారుడు విజయ్ తనదైన మార్గంలో కొనసాగించారు. ఒకరు నైజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తుపాకీ గుండుకు ఎదురొడ్డి ప్రాణత్యాగం చేస్తే..మరొకరు ప్రజా ఉద్యమాల ద్వారా అదే స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లారు. అందుకే ఎం,వెంకటాయపాలెం చరిత్రలో గంగవరపు శ్రీనివాసరావు, గంగవరపు విజయ్‌ల కథ ఒక కుటుంబ కథగా మాత్రమే మిగిలిపోలేదు. ప్రజల హక్కుల కోసం సాగిన రెండు తరాల పోరాట గాథగా నిలిచింది. ప్రతి ఏడాది తెంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించినప్పుడు సిపిఐ ఆధ్వర్యంలో ఈ ఇద్దరు పోరాట వీరుల విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించడం ఆనవాయితిగా కొనసాగుతోంది.

# తెలంగాణ సాయుధ పోరాటానికి వన్నె తెచ్చిన బోనకల్..!

**-మండలంలోని ప్రతి గ్రామానికి పోరాట చరిత్రతతో విడదీయరాని బంధం**
**-నేటికీ కొనసాగుతున్న నాటి పోరాట స్ఫూర్తి**

**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో బోనకల్ మండలానికి ప్రత్యేక స్థానం ఉంది. నిజాం నిరంకుశ పాలన, రజాకార్లు, జమీందారులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో సాగిన పోరాటంలో బోనకల్ మండలంలోని అనేక గ్రామాల ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నాటి పోరాట యోధుల త్యాగాలకు సాక్ష్యంగా నిలుస్తోంది. చిరునోముల గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తామ్రపత్ర గ్రహీత రావెళ్ల జానకీరామయ్య ఉమ్మడి వరంగల్ జిల్లా ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఆయన నాయకత్వంలో గోవిందాపురం, చిరునోముల, చొప్పకట్లపాలెం, బ్రాహ్మణపల్లి, రాపల్లి, లక్ష్మీపురం, తూటికుంట్ల, ముష్టికుంట్ల, పెద్దబీరవల్లి, సీతానగరం, రాయన్నపేట, ఆళ్లపాడు, బోనకల్, పొద్దుటూరు తదితర అనేక మంది యువత ఉద్యమకారులుగా తీర్చిదిద్దబడ్డారు. లక్ష్మీపురానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లు దళ కమాండర్‌గా వ్యవహరించగా, గోవిందాపురానికి చెందిన తమ్మారపు గోవిందు, చండూరి నరసింహరావు, జొన్నలగడ్డ రామయ్యలు ఉపకమాండర్లుగా పనిచేశారు. వివిధ గ్రామాలకు చెందిన యువకులు దళ సభ్యులుగా, కొరియర్లుగా ఉద్యమానికి తమ వంతు సహకారం అందించారు. మహిళలు సైతం దళాలకు ఆహారం అందిస్తూ, సమాచారాన్ని చేరవేస్తూ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు.

**ఏడుగురు యోధుల వీరమరణం**

రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేయడానికి నిజాం సైన్యం, పోలీసులు, రజాకార్లు అనేక గ్రామాల్లో దాడులకు పాల్పడ్డారు. 1948 ఫిబ్రవరిలో గోవిందాపురం పరిసర ప్రాంతాల్లో జరిగిన దారుణ ఘటనలో



ఏడుగురు పోరాట యోధులను పట్టుకుని కాల్చి చంపి ఒకే చితిపై దహనం చేశారు. ఈ ఘటన ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలించడంతో పాటు ఉద్యమ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసింది. అనంతరం గోవిందాపురంలో ఆ వీరుల స్మారక స్థూపాన్ని నిర్మించారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలు పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరావు, మాకినేని బసవపున్నయ్య తదితరులు ఈ ప్రాంతంలో పర్యటించి కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. 1963లో మాకినేని బసవపున్నయ్య గోవిందాపురంలో వీరమరణం పొందిన ఏడుగురు యోధుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు.

**-నేటికీ కొనసాగుతున్న పోరాట స్ఫూర్తి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగి దశాబ్దాలు గడిచినా బోనకల్ మండలంలో నాటి పోరాట స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నాయని నాయకులు పేర్కొంటున్నారు. నాటి యోధుల త్యాగాలను పోరాట చరిత్రను నేటి తరానికి అందిచాల్సిన అవసరం ఉందన్నారు.

**-పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి**

**యంగల ఆనందరావు, సిపిఐ మండల కార్యదర్శి, బోనకల్**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ఒక పాఠ్యాంశంగా చేర్చాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. పోరాటంలో పాల్గొన్న నాటితరం క్రమంగా కనుమరుగుతున్న నేపథ్యంలో చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలని ఆయన డిమాండ్ చేశారు.

# సమ్మె నోటీసు నుంచి అగ్రిమెంట్ల వరకు.. ఏఐటీయూసీ విజయఢంకా..!

**- కార్మికుల డిమాండ్లపై యాజమాన్యంతో కీలక ఒప్పందాలు**
**- హక్కులు సాధించే వరకు రాజీలేని ఉద్యమం : వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్**

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ చేపడుతున్న పోరాటాలకు కార్మికుల నుంచి విశేష మద్దతు లభిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. కొత్తగూడెం, కార్పోరేట్, సత్తుపల్లి ఏరియాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శేషగిరిభవన్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో ఆర్ఎల్‌సీ సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో నిర్వహించిన వరుస చర్చల ఫలితంగా 23 కీలక డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించామని నాయకులు తెలిపారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 202526 వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు చర్యలు వంటి అంశాల్లో అంగీకారం సాధించామన్నారు. బదిలీల్లో మూడేళ్ల నిబంధనకు బదులుగా ఖాళీల ఆధారంగా ఏడాది నిబంధన అమలు, అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు ఓవర్‌మెన్ ప్రమోషన్లు హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల సవరణ, సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీతోపాటు వారం రోజుల వరకు వైద్య సేవలు అందించడం వంటి అంశాలపైనా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు.

**ప్రచారం కాదు.. పోరాటమే ఏఐటీయూసీ విధానం:**

కార్మికుల సమస్యలను కేవలం ప్రకటనలకు పరిమితం చేయకుండా సమ్మె నోటీసు ఇచ్చి, ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిపి యాజామా







న్యంపై ఒత్తిడి తీసుకువచ్చి అగ్రిమెంట్లు సాధించామని వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఏఐటీయూసీ సాధిస్తున్న విజయాలను చూసి ఓర్వలేక కొన్ని సంఘాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఇతరుల పోరాట ఫలితాలను తమవిగా చెప్పుకోవడం సులభమేనని, కానీ యాజామాన్యం ముందు నిలబడి కార్మికుల హక్కుల కోసం పోరాడి అగ్రిమెంట్లు సాధించడం అంత సులభం కాదన్నారు. కుదిరిన అగ్రిమెంట్లు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఏఐటీయూసీ పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రావాల్సిన ప్రతి హక్కు, ప్రతి ప్రయోజనం అందే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, భీమయ్య, సహాయ కార్యదర్శులు, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇన్‌చార్జి ఎర్రగాని కృష్ణయ్య, ఆఫీస్ బేరర్లు, అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రెటరీలు, వివిధ కమిటీల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# పండుగలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి..

**ఘనంగా ముత్యాలమ్మ తల్లికి బోనాలు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** పండుగలు ప్రజల్లో ఐకమత్యాని పెంపొందిస్తాయని సిపిఐ నాయకులు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ 44వ, డివిజన్ కార్పోరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు అన్నారు. డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో శ్రావణమాస పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం వీసంశెట్టి దంపతుల చేతుల మీదుగా అన్నదాన వితరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ మాజీ కార్యదర్శి కొమ్మవరపు ఆదాం, అవిరెల్ల వెంకన్న, కేసుపాక వెంకటేశ్వర్లు, మస్తాన్ ఖురేషి, కోవెల పద్మ, నందిగామ జయ



రాజు, నారపోగు నాగరాజు, పెంచళ రాంబాయి, గంగపరి ప్రవీన్, బన్నల రవి, బంక రాము, బంక అన్వేష్, మోరె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామ శివారులో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. జల్లేరు వాగు ఒడ్డున మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మర్కోడు పంచాయితీ సుద్దరేవు గ్రామానికి చెందిన పూణెం రామ్‌నారాయణ(50)గా మృతుడిని గుర్తించారు. గత నాలుగేళ్లుగా గ్రామంలో నివసిస్తున్న ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంత్రాలు, నాటు మందులతో పూజలు చేస్తుంటారని గ్రామస్తులు తెలిపారు. అయితే మృతుడి ఛాతిపై కత్తితో దాచి చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో హత్య జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎస్ఐ సోమేశ్వర్ మాట్లాడుతూ ఛాతిపై కత్తితో దాడి చేసిన ఆనవాళ్లు ప్రాథమికంగా కనిపిస్తున్నాయని, హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి అసలు కారణం, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవుతాయని చెప్పారు.

## తురక కాశ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** తరతరాలుగా తురక కాశ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ బాద్‌షా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రుగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తురక కాశ కార్మికుల ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రతి ఏటా రూ 1,000కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక నిధులు కేటాయించి, కార్పొరేషన్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సయ్యద్ జాన్‌పాషా, మండల యువజన అధ్యక్షుడు సయ్యద్ కరిముల్లా, జిల్లా కార్యదర్శి సయ్యద్ పాషా, సైదా తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారణకు బోను ఏర్పాటు




**ప్రజాపక్షం/చంద్రుగొండ :** మండల కేంద్రంలో కోతుల బెడద నివారణకు సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణ గ్రామస్తుల సహకారంతో శనివారం బోను ఏర్పాటు చేశారు. గత పంచాయితీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతంలోనూ కోతులను నియంత్రించామని, మళ్లీ సంఖ్య పెరగడంతో చర్యలు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. ఏ వీధిలో కోతుల బెడద ఎక్కువగా ఉంటే అక్కడ వరుసగా బోన్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, పారుపల్లి భాస్కరరావు, చాపలమడుగు లక్ష్మణరావు, ఇమ్రాన్, నిమ్మగడ్డ శ్రీను, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## మార్క్సిస్టు యోధుడు సీతారాం ఏచూరి



**ప్రజాపక్షం/కారేపల్లి:** నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయిస్తూ ప్రజా ఉద్యమాలకు దిశానిర్దేశం చేసిన విప్లవకారుడు సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా కారేపల్లి, మాణికార్యం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థి ఉద్యమం నుంచి సీపీఎం అఖిల భారత కార్యదర్శి స్థాయికి ఎదిగిన ఏచూరి నిత్య అధ్యయనశీలిగా, పేదలు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడారని నాగేశ్వరరావు గుర్తు చేశారు. ప్రస్తుత యువత, విద్యార్థి ఉద్యమాలకు ఆయన ఆదర్శమన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు తలారి దేశప్రకాష్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కే నరేంద్ర, వజ్జ రామారావు, మక్కా సీతారాములు, కరపడి సీతారామయ్య, కరపటి లక్ష్మయ్య, కరకపల్లి రాయమల్లు, ఆధర్ల విజయ్ కుమార్, పాయం వరలక్ష్మి, ఆరెల్లి శ్రీరాములు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం



**ప్రజాపక్షం/కారేపల్లి:** వర్షం పడితే కారేపల్లి బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం పరిసరాలు వర్షపు నీటితో చెరువును తలపిస్తున్నాయి. నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, చిన్నారులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 18 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, అంగన్వాడీకి 15 మంది చిన్నారులు, నలుగురు గర్భిణులు వస్తున్నారు. వర్షపు నీటిలోంచి రాకపోకలు సాగించాల్సి రావడంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంగన్వాడీ టీచర్ రఘుపతి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అనూష తెలిపారు. లోతట్టు ప్రాంతాన్ని మట్టితో నింపి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/మధిర:** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం మధిర పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపి సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషదాల లభ్యత, వార్డు నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య, నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, బంధువులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్యసేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతిఒక్కరికి నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాద్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని మధిర హాస్పిటల్‌లో అన్ని వైద్యుసేవలు దొరుకుతాయి అనే విశ్వాసాన్ని నమ్మకాన్ని మధిర ప్రజలకే కాకుండా చుట్టుప్రక్కల నియోజకవర్గం ప్రజలకి కలిగించాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభరగా ఉంచాలని, తాగునీరు విద్యుత్,పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులలు మెరుగ్గా ఉండేలా చరయలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతిఒక్కరికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర మెడిసిన్‌తో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని తెలిపారు. మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, అలాగే ఐటిఐ భవనం, ఏఐటిసి సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం, పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహశీల్దార్ రాంబాబు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిదిలోని వేపకుంట్ల గ్రామంలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. శనివారం గ్రామంలో లబ్దిదారులకు సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన వారందరికి ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కార్డు ఉండాలన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డు ద్వారా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ పథకాల లబ్ది మరింత సులభతరం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్వని, డీలర్ రాంబాబు, స్థానికులు నర్సింహారావు, నాగేశ్వరరావు, శ్రీను, వెంకటేశ్వర్లు, సందీప్, రమేష్, పిచ్చయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

# వివిపాలెంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భట్టివిక్రమార్క యువసేన సహకారంతో మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శనివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన గ్లెనీగల్స్, ఫోర్టీస్ నెట్‌వర్క్ ఆసుపత్రుల వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య సేవలను అందించారు. ప్రజలకు గుండె, కంటి, దంత, జీర్ణకోశ, శ్వాసకోశకు సం బంధించిన విభాగాల నిపుణులు పాల్గొని సేవలు అందించారు. ప్రజలకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కాపా ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఉపసర్పంచ్ గుగులోత్ ప్రవీణ్, కిలారు అనిల్‌కుమార్, కిలారు వెంకటరమణ, యంద్రాతి మురళీకృష్ణ, రాజు, తగరం నాగరాజు, కన్నెగంటి హర్ష, నాగరాజు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

# వినాయక వ్రతకల్పం పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వినాయక వ్రతకల్పం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఖమ్మం క్లాత్ అండ్ రెడీమెడ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గెల్లా రవి భక్తుల కోసం ప్రత్యేకంగా ముద్రించిన ఈ పుస్తకాన్ని శనివారం ప్రముఖ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గెల్లా రవి మాట్లాడుతూ హిందువులకు ఇష్టమైన పండుగలలో వినాయక చవితి ఒకటని విఘ్నేశ్వరున్ని భక్తి శ్రద్దలతో పూజించడం ద్వారా విఘ్నాలు తొలగిపోతాయన్నారు. ఈ పూజా విధానాన్ని అందరికీ అందించాలనే లక్ష్యంతో పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. వాసవీ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు టిఎస్ చక్రవర్తి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఉపయోగపడే పూజా విధానాన్ని పుస్తక రూపంలో అందించడం అభినందనీయమన్నారు. వినాయక చవితి పండుగ సంస్కృతీకి ప్రతిరూపమని, ఐక్యతతో ప్రకృతి, పర్యావరణం పట్ల ప్రేమతో ఈ పండుగను నిర్వహించుకోవాలన్నారు. ఈ ఏడాది వినాయక చవితి ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సర్వేశ్వరుడు విఘ్నాలు లేకుండా చేయాలని ప్రార్థిస్తున్నట్లు చక్రవర్తి తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవీ నగర్ అధ్యక్షులు కోదుమూరు భద్రయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్దంశెట్టి శ్రీకాంత్, ఆర్యవైశ్య సభ నాయకులు పుల్లారావు, వ్యాపారవేత్తలు శ్రవణ్, సృజన్‌కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో డీజేలకు నో పర్మిషన్



**ప్రజాపక్షం/మధిర:** ఖమ్మం జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు శనివారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ నందు గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ వారికి అవగాహన సదస్సును మధిర టౌన్ సిఐ రమేష్ నిర్వహించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణలో పోలీస్ వారి సూచనలు పాటించాలని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. డిజేలకు పర్మిషన్ లేదు అని, కాదని ఎవరైనా గణేష్ ఉత్సవాల్లో డీజేలను వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నవిత కిషోర్‌తో పాటు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి



**ప్రజాపక్షం/వైరా:** సిపిఎం మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను ముందు కు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ పిలుపునిచ్చారు. సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పైడిపల్లి సాంబశివరావు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఏచూరి జీవితాంతం పోరాడారని అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఏచూరి ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, గుమ్మా నర్సింమారావు, కామినేని రవి, తోట కృష్ణవేణి, కంసాని మల్లికాంబ, అమరనేని కృష్ణ,చిట్టోజి నాగేశ్వరరవు, పమ్మి విజయరాజు పాల్గొన్నారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా గణపతి ఉత్సవాలు




**ప్రజాపక్షం/వైరా:** న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గణపతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.భూమేష్‌రావు బొజ్జ గణప్యకు ఉండ్రాళ్ల సమర్పించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బొజ్జ గణపయ్య వేషధారణలో నృత్యాలు ప్రదర్శించి అలరించారు. అనంతరం గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి పాఠశాల నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి సాగనంపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.భూమేష్ రావు మాట్లాడుతూ వినాయకుడు సకల దేవతాగణాలకు అధిపతి అని, అందుకే గణనాకుడు, గణపతి, గణేశుడు అనే పేర్లతో పిలుస్తారని తెలిపారు. అన్ని విఘ్నాలను తొలగింప విఘ్నేశ్వరుడిగా, ప్రతి కార్యానికి, పూజకు ప్రథమంగా పూజించబడే దేవుడిగా వినాకుడికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విజయానికి, విద్యకు జ్ఞానానికి వినాయకుడు ప్రతీకగా నిలుస్తాడని పేర్కొన్నారు. తెలుగు వారి పండుగల్లో వినాయక చవితికి విశిష్ట స్థానం ఉందన్నారు. ప్రకృతి, ప్రాణి మధ్య సామరస్యాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని గణపతి ఆరాధాన అందిస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వినాయక ఉత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యత ,పర్యావరణ స్పృహ పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, నర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# లోక్ అదాలత్‌లో 41 కేసుల రాజీకి చొరవ




**వైరా పోలీస్‌స్టేషన్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహారావుకు ప్రశంసా పత్రం**


**ప్రజాపక్షం/వైరా:** జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా భాగంగా మధిర కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో వైరా పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన 41 క్రిమినల్ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ దుగ్గిదేవర నర్సింహారావకు మధిర పిడిఎఫ్ కోర్టు మేజిస్ట్రేట్ వేముల దీప్తి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మధిర కోర్టు పరిధిలోని ఆరు పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసుల్లో వైరా పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన 41 క్రిమిన్ కేసులు కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీ అయ్యేలా నర్సింహారావు కీలకంగా వ్యవహరించారు. కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి, ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిరేలా ఆయన కృషి చేశారు. ఈ సేవలను గుర్తించిన మేజిస్ట్రేట్ వేముల దీప్తి నర్సింహారావుకు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం కావడంతో కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరు వర్గాల మధ్య సఖ్యతకు కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరువర్గాల మధ్య సఖ్యతకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రశంసా పత్రం అందుకున్న నర్సింహారావును వైరా ఏసిపి ఎస్.సారంగపాణి, పట్టణ ఎస్సై పుష్పాల రామారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా, మధిర పట్టణ, మధిర రూరల్ సిఐలు వెంకటప్రసాద్, దోమల రమేష్ పాల్గొన్నారు.

# విద్యుత్ భద్రతపై గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/వైరా:** వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన విద్యుత్ భద్రత చర్యలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన గోడపత్రికను ఖమ్మం సూపరిండెంట్ ఇంజనీర్ ఆవిష్కరించారు. వైరా డివిజన్, వైరా సబ్ డివిజన్, వైరా సెక్షన్ పరిధిలో గణేస్ మండపాల నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.రమేష్, ఏడి రామకృష్ణతో పాటు ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాస్-2026



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 6వ వార్డులో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్(అటానమస్)కళాశాలలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథస్2026ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 45 బృందాలు పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన 10 బృందాలు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల గోపాల్, సీనియర్ నిపుణులు వజ్రాల రాజశేఖర్‌రెడ్డి, మృదులరెడ్డి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకరటమణ, కళాశాల ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించం

**భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన మహత్తర పోరాటం**
**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**





**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, చరిత్రను చరిత్రగా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. శనివారం మండలంలోని గోవిందాపురం(ఎల్)లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్య స్థూపాలకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో ఒకే చితిపై దహనం చేసి ఏడుగురు అమరుల స్థూపానికి బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం..భుక్తి కోసం.. వెట్టిచాకిరి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన విరోచిత పోరాటంలో సుమారు 4500 మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు ఉద్యమానికి ఉందన్నారు. హిందూ, ముస్లీం పోరాటంగా చిత్రీకరించడం చరిత్ర వక్రీకరణే అని ఆయన స్పష్టం చేశారు. నిజాం ముస్లీం పాలకుడైనంత మాత్రాన ఆ పోరాటాన్ని ఒక మతానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా చూపడం సరికాదన్నారు. కుల, మతాలకు అతీతంగా రైతులు, పేదలు, కూలీలు ఏకమై సాగించిన సామాజిక, ఆర్థిక విముక్తి పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమన్నారు. మతం పేరుతో ప్రజల్లో విభజన సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంతో పాటు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ డిమాండ్ చేస్తోందన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించడలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఆనాటి పోరాట యోధుల కుటుంబాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. గోవిందాపురం(ఎల్) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన గ్రామమని హేమంతరావు అన్నారు. మల్లెల వెంకటేశ్వరరావు నాయకత్వంలో తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్యతో పాటు అనేకమంది కుల, మతాలకు అతీతంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. సాయుధ పోరాటంలో గ్రామ ప్రజల భాగస్వామ్యాన్ని అణచివేయాలనే ఉద్ధేశ్యంతో ఏడుగురు అమరులను ఒకే చితిపై దహనం చేసిన ఘటన ఈ ప్రాంత పోరాట చరిత్రలో చెరగని విషాద ఘట్టమన్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై మరిన్ని ఉద్యమాలు నిర్మించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయాలని హేమంతరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు, మాజీ ఎంపిటిసీ జొన్నలగడ్డ సునీత, సిపిఎం గ్రామ కార్యదర్శి తమ్మారపు లక్ష్మ ణ్, గోవిందాపురం(ఎల్) సర్పంచ్ మంద కరుణ, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, పుచ్చకాయల తిరపతయ్య, తమ్మారపు మల్లయ్య, తమ్మారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 16 నుంచి మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మె




**ప్రజాపక్షం/కల్లూరు:** 16వ తేదీ కల్లూరు మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు మున్సిపాలిటీ కార్మికులు సంఘం ఏఐటీయూసీజిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం ముందు కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం తెలిపి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత తొమ్మిది నెలలుగా పెండింగ్ వేతనాలు ఉన్న పాలకవర్గానికి మున్సిపాలిటీ అధికారులకు స్పందన లేదని కనుక 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు .16వ తేదీ బుధవారం నుంచి పూర్తిస్థాయిలో విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్లు వారి పేర్కొన్నారు. వేతనాలు లేక కుటుంబాలు అప్పుల పాలై జీవనం ఇబ్బందికరంగా మారిందని ప్రైవేటు వ్యక్తుల వద్దఅప్పులు తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నామని 9 నెలలైనా పాలకవర్గానికి ప్రభుత్వాధికారులకు స్పందన లేకుండా నిర్లక్ష్యంగా కార్మికుల పట్ల వ్యవహరిస్తున్నారని కార్మికుల కష్టాలు పట్టించుకోకుండా పట్టి పట్టనట్లు ఉన్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఒక్కొక్కరికి లక్షన్నరపైగా రావాల్సి ఉండగా జీవనం ఇరుగుపొరుగు వారిపై ఆధారపడిందని మావేతన వెతలు మా గోడు ఎవరికి చెప్పుకోలేక పోతున్నారని ఆయన వివరించారు. నిర్లక్ష్యం ధోరణిలో ఉన్న పాలకవర్గం మున్సిపాలిటీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పట్టించుకోని మా కుటుంబాలను ఆదుకోవాలని అంటూ వారికి మొరపెట్టుకుంటున్నారు. జీతమా జీవితమా ఇదేమి వేదన అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. మున్సిపాలిటీ ప్రజలు కార్మికులకు మద్దతునిచ్చి సంఘీభావంతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ మండలకన్వీనర్ కొత్తపల్లి వెంకటనారాయణ జిల్లా మున్సిపాలిటీ కార్మిక సంఘం కార్యదర్శి వజెర్మియా మున్సిపాలిటీ సోషల్ మీడియా అధ్యక్షులు మణి రాజు ,జరిపోతుల మంగమ్మ, ఖమ్మంపాటి రాణి ,ఉబ్బనమురళి నరసింహారావు సుధాకర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/మధిర:** మధిర–మోటమర్రి మార్గంలోని ఆర్‌సిఎం చర్చి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున విషాద ఘటన చోటు చేసుకుంది. వ్యక్తిగత కారణాలతో గుండాల నర్సింహారావు(43),తండ్రి బోసు, గూడ్స్ రైలు క్రింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మధిర రైల్వే పరిధిలోని కిలోమీటర్ నెంబర్ 528/46 వద్ద తెల్లవారుజామున సుమార 3.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. ఖమ్మం ఎస్సై సిహెచ్.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మధిర రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్సై వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

**- కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి**



**ప్రజాపక్షం/వైరా:** ప్రతి బిడ్డకు పౌష్టికాహారం అందేలా తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైరా మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు అన్నారు. పోషకాఆరంతో చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. 13వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం 4లో పోషణ వారోత్సవాల్లో భాగంగా పోషణ మేళా, పోషకాహార వంటకాల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కౌన్సిలర్ విజయలక్ష్మి ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరు ధాన్యాలు, పండ్లు తదితర పోషక విలువలున్న ఆహారాన్ని పిల్లలకు అందించాలని వివరించారు. పోషకాహార లోపం, నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ గుర్రాల అన్నపూర్ణ, ఆయా కృష్ణకుమారి, ఏఎన్ఎం కృపావరం, ఆశా వర్కర్ ఆదిలక్ష్మి , చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# సిపిఐ-సిపిఎం రాజీ..20 కేసులకు తెర

**- పరస్పర ఒప్పదంతో కేసుల విత్‌డ్రా**
**- శుభ పరిణామంగా అభివర్ణించిన న్యాయమూర్తి**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సిపిఐసిపిఎం పార్టీల మధ్య శనివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. నాటి ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం గ్రామపంచాయతీ సమయంలో ఇరు పార్టీల మధ్య చోటు చేసుకున్న వివిధ ఘర్షణలకు సంబంధించి నమోదైన సుమారు 20 కేసులను ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో రాజీ చేసుకున్నారు. ఇందుకు లోకాదళత్ వేదిక కాగా..ఏసీపీ తిరుపతిరెడ్డి సారథ్యంలో ఈ ప్రక్రియ సుగమమైంది. ఈ ఉదాంతపై న్యాయమూర్తి సైతం హర్షం వ్యక్తం చేస్తూ ఇరు వర్గాల పరస్పర అవగాహనతో ముందుకు రావడం మంచి పరిణామమని అభివర్ణించినట్లు తెలిసింది. అలాగే పోలీస్ వారికి సైతం అభినందలు తెలిపినట్లు తెలిసింది.

# పిచ్చి మొక్కలు తొలగింపు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో అన్నారుగూడెం నుండి తల్లాడకు వెళ్లే కేతినేని థియేటర్ రోడ్డులో ఉన్న పిచ్చి మొక్కలను శనివారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. రోడ్డు చుట్టూ వేసిన మొక్కలకు చుట్టు పక్కల విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిని సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, దగ్గరుండి పర్యవేక్షించారు. వర్షాకాలం నేపథ్యంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి చెట్లకు అడ్డు ఉండడంతో వాటిని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి వెంకటనర్సయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ హుస్సేన్, గుమస్తా రమేష్ తదితరులు ఉన్నారు.

# పలువురిని పరామర్శించిన మాజీ ఎంఎల్‌ఎ సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని గొల్ల గూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దుండేటి కేశవరెడ్డి చిత్రపటానికి మాజీ ఎంఎల్‌ఏ సండ్ర వెంకట వీరయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శనివారం కేశవరెడ్డి సతీమణి దుండేటి కళావతిని పరామ ర్శించి కేశవరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన గుండ్ల నర్సింహారావు సతీమణి గంగా భవాని తల్లి లింగమ్మని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, బిఆర్ఎస్ మండల నాయకులు వీరకృష్ణ, పట్టణ అధ్యక్షులు జివిఆర్, శ్రీను, నాగేశ్వరరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వీరయ్య, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మ ణ్, రఘు, తిరుపతిరావు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు



**ప్రజాపక్షం/ తల్లాడ :** స్పీకర్‌పై తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ధర్మాసోత్ దశరథ్ నాయక్ తీవ్రంగా ఖండించారు. శనివారం తల్లాడ మండలం రంగం బంజర్ గ్రామంలో ధర్మసోత్ దశరథ్ నాయక్, గుగులోత్ కృష్ణానాయక్ లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో కుల వివక్ష తీవ్ర స్థాయిలో పెరిగిందన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బిఆర్ఎస్ ఎంఎల్‌సి తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు.

# ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని టేకులపల్లిలో గల లక్ష్య టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో వరుసగా 13 సంవత్సరాల నుండి మట్టి గణపతి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం 300 మట్టి గణపతి విగ్రహాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ మండల తహశీల్దార్ వీరభద్రు నాయక్, గౌరవ సిఐ ముత్తు లింగం గౌడ్, ప్రిన్సిపాల్ ఈశ్వర్ తదితరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

# విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ



**ప్రజాపక్షం/మధిర:** వనమా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు(సూరి)చే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు 5వ తరగతి పిల్లలకు జామెట్రీ బాక్సులు, ఆరో తరగతి పిల్లలకు మినీ డిక్షనరీలో మూడు భాషల్లో ఇవ్వడం జరిగింది. అంబారుపేట, నిదానపురం, మాటూరు, మాటూరుపేట, నాగవరప్పాడు, మర్లపాడు, సిపిఎస్ మధిర, హరిజనవాడ మధిర స్కూళ్లలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశ్రావతి ఉపాధ్యాయులు లింగంపాల్లి అప్పారావు మాట్లాడుతూ జామెట్రీ బాక్సలను, మినీ డిక్షనరీలను, పెన్నులను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిదానపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండపల్లి నారాయణదాసు, ఆర్.గంగారావు, తోటి ఉపాధ్యాయులు వనమా వేణుగోపాలరావుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేములపలిల ప్రసాద్, జల్లా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.